క్లుప్తంగా

టోల్‌గేట్ రుసుంను ఎత్తేయాలి

పెద్దకొత్తపల్లి: సలేశ్వరం జాతరకు వెళ్లే భక్తుల వాహనాలకు టోల్‌గేట్ రుసుంను ఎత్తేయాలని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి రాగి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమర్‌నాథ్‌గా పిలువబడే సలేశ్వరం జాతరకు వెళ్లే భక్తుల నుంచి ఫారెస్ట్ అధికారులు టోల్‌గేట్ రుసుము వసూలు చేయడం సరికాదన్నారు. కారు, జీపుకు రూ.500లు, ట్రాక్టర్, ఆటో రూ.500లు, లారీ, బస్సు, డీసీఎంకు రూ.1000లు, మోటర్ సైకిళ్లకు రూ.100లు టోల్‌గేట్ రుసుం వసూలు చేయడం దారుణమన్నారు. కనీసం భక్తులకు తాగునీటి వసతి కూడా అధికారులు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. 10 రోజులు పాటు స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

బీఎంపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఎంపీ అభ్యర్థి గడ్డంవిజయ్ సోమవారం మండలంలోని ఉయ్యలవాడ, నల్లవెల్లి, బొందలపల్లి, శ్రీపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా ఆశీర్వదించాలని అభ్యర్థించారు. బీఎంపీ తోనే ఉచిత విద్య, వైద్యం అందుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. జెట్టి సత్యం, రామచంద్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన ఎల్లమ్మ(45) గర్భసంచి సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని శ్రీపురంరోడ్డు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గర్భసంచి ఆపరేషన్ చేయించుకుంది. చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతో ఎల్లమ్మ మృతి చెందిందని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు.

రోడ్డు పక్కన చెట్లకు నిప్పు



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగాయి. కాని అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లకు నిప్పుపెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని దుండగులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మేడేను ఘనంగా నిర్వహించుకుందాం



కల్వకుర్తిరూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో బి శ్రీనివాసులు, ప్రభాకర్, బాల్‌రెడ్డి, ప్రసన్నకుమార్, యాదయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు అందించాలి



వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో బిల్లులు అందించాలని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు చేసే ప్రదేశాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. వేసవిలో పనులు చేస్తున్న కూలీలకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కూలీలకు బిల్లులు అందడం లేదని ఆరోపించారు. ఎంపీడీఓకు సమస్యలను విన్నవించగా రెండురోజుల్లో బిల్లులు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, రామస్వామి, పెద్దయ్య, మోహన్‌రెడ్డి, అంజన్ కుమార్ తదితరులు ఉన్నారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం



తెలకపల్లిలో గోపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తెలకపల్లి: అన్ని మతాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గవెంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని అన్నారు. ఆలయం 1640 సంవత్సరంలోనే నిర్మించారన్నారు. అలాంటి పురాతన దేవాలయాన్ని మళ్లి పునర్నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని కోరారు. అనంతరం గోపూజ పూజ నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే

పెద్దపల్లి బుగ్గవెంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశానని గుర్తుచేశారు. కార్యక్రమంలో అలయ కమిటీ అధ్యక్షుడు దర్శి రాజయ్య, కందూరు లక్ష్మణస్వామి, కందూరు బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పరథం ఊరేగింపు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి పుష్ప రథం(చిన్న తేరు) వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్ర సమేత లక్ష్మణస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. శ్రీరామ భజనలు, కోలాటాలు ఆడారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి ఉత్సవాలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం రెండో రోజు హనుమాన్ జయంతి ఉత్సవాలు కొనసాగాయి. అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి రుద్రాభిషేకం, లక్ష్మీహరహరరుద్రహోమం, విశేష అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. రాత్రి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్ జ్ఞానయజ్ఞ సమితి ఆధ్వర్యంలో గీతా పారాయణం, హనుమాన్‌చాలీసా పఠనం చేశారు.

కొనసాగుతున్న పూజలు

తాడూరు: మండలంలోని పొల్మూరులో సీతారామాంజనేస్వామి నూతన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాల ప్రారంభం, నవకలశ పూజలు, పూర్ణాహుతి, శాంతిహోమం, జలాధివాసం విష్ణుసహస్ర పారాయణం, శయ్యాదివాసం, ఫలపుష్పధాన్య పూజా వంటి కార్యక్రమాలు వేదబ్రాహ్మణుల మంత్రోత్సవాల నడుమ భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. నిర్వాహకులు బాల్‌రెడ్డి, జంగిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.



తాడూరు మండలం పొల్మూరులో



కల్వకుర్తిలో నిర్వహించిన యజ్ఞంలో..



లింగాలలో పుష్ప రథాన్ని లాగుతున్న భక్తులు

బీజేపీకి 13 సీట్లు రావడం ఖాయం



మాట్లాడుతున్న జక్కా రఘునందన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 13 సీట్లు గెలుపొందుతుందని బీజేపీ పార్లమెంట్ ఛీఫ్ ఎలక్షన్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జక్కా మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. ఈ ఎన్నికలు దేశభద్రతకు సంబంధించిన ఎన్నికలని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ప్రధాని ఎవరో చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. నాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన బీజేపీని గెలిపించాలని కోరారు. విద్యావంతుడు భరత్‌ప్రసాద్‌ను గెలిపించుకుందామన్నారు. దేశంలో 400 సీట్లలో బీజేపీ ప్రభంజనం ఖాయమన్నారు. ఈ నెల25న భరత్‌ప్రసాద్ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తారని ముఖ్య అతిథిగా గుజరాత్ ముఖ్యమంత్రి హాజరవుతారని వివరించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణకుమార్ నాడు హిందూ దేవతలను నమ్మనని ప్రతిజ్ఞ చేశారని నేడు ఓట్ల కోసం దేవాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీలు

లింగాల: మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో అక్రమాలు చోటు చేసుకుంటున్నా తనఖీలలో అధికారులు అక్రమాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 14వ విడత ఉపాధి పనుల సామాజిక తనిఖీల ప్రజావేదిక తూతూ మంత్రంగానే కొనసాగింది. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఎన్నికల కోడ్‌ను ఆసరగా చేసుకొని మండలంలో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా సామాజిక తనిఖీలను నిర్వహించారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలలో ఏడాది కాలంలో రూ. 3.17 కోట్ల పైగా నిధులను ఖర్చు చేశారు. కాని సామాజిక తనిఖీలలో అధికారులు రికవరి కేవలం రూ.1.80 లక్షల మేరకు గుర్తించడం అనుమానాలకు తావిస్తుంది. హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ విషయంలో తప్పుడు లెక్కలు చూపడం, మస్టర్లలో బినామీ పేర్లు ఉండడం, పండు ముదసలి పేర్లను మస్టర్లలో చేర్చడం, పనులలో ఖచ్చితమైన లెక్కలను చూపక పోవడం తదితర అక్రమాలు జరిగినా అధికారులు మాత్రం పనులపై ఎలాంటి స్పందన కనబర్చడపోవడంతో అనుమానాలకు తావిస్తుంది. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఓబులేష్, ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆంజేయులు, ఏపీఓ ఇమాం అలీ ఎం. చంద్రోశేఖర్, క్యూసీ కృష్ణారావు, అంబుడ్స్ మెన్ జంగయ్య, ఏవీఓ రాజు, విజిలెన్స్ వింగ్ అధికారి నసీరోద్దీన్, ఎస్ఆర్పీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు నిబంధనలు పాటించాలి



ఫరహాబాద్ వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద టికెట్ తీసుకుంటున్న భక్తుడు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం లోతట్టు అటవీ సరిహద్దు ప్రాంతంలో మూడు రోజుల పాటూ కొనసాగే సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సావాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అటవీ శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మాత్రమే అటవీ సరిహద్దులోకి వెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఫరహాబాద్ గేటు వద్ద టోల్ రుసుము వసూలు చేయడంతో పాటు సలేశ్వరం వెళ్లే వాహనాలను పూర్తి స్థాయిలో తనిఖీలు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలు అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల తదితర ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను నడిపిస్తున్నారు. ఆర్టీసీ బస్సులకు టోల్ రుసుము నుంచి మినహాయింపు ఇచ్చారు.

అటవీ శాఖ టోల్ గేట్ల ఏర్పాటు

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న సలేశ్వర క్షేత్రంలో జరిగే ఉత్సవాలను పురస్కరించుకొని అటవీ శాఖ పలు మార్గాలలో టోల్ గేట్లను ఏర్పాటు చేసింది. బేస్ క్యాంపు సమీపంలో అటవీ శాఖ వారు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామని ఎఫ్ఆర్వో వీరేషం తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేత


పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం అదే గ్రామానికి చెందిన అర్జున్ రూ.60 వేల విరాళంగా సోమవారం అందజేశారు. ఈ డబ్బులతో పాఠశాలకు విద్యుత్ సౌకర్యం, కిటికీల ఏర్పాటు, ఫ్యాన్‌లు పాఠశాలకు కలర్ వేయించారు. ఈ సందర్భంగా దాతను నాయకులు శివకుమార్‌రావు, గోపాల్‌రావు అభినందించారు.

నిత్యాన్నదానానికి..

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తాడూరు మండలానికి చెందిన జనంపల్లి మనోహర్, రాజు, శ్రీలక్ష్మి నిత్యాన్నదానం కోసం రూ.25116వేలు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు.

పౌరాణిక నాటకానికి..

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో మల్లికార్జున పౌరాణిక నాటకం నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తగుళ్ల కొండల్‌యాదవ్ కళాబృందానికి రూ.15వేలు విరాళంగా అందజేశారు. కళాకారులు ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్యగౌడ్, బక్కయ్యగౌడ్, చంద్రయ్య, చిన్న జంగయ్య తదితరులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న కొండల్‌యాదవ్

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



కొల్లాపూర్: మండలంలోని ఏషియన్ డైమండ్ స్కూల్ సోమవారం ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. ప్రధాన కూడళ్ల వద్ద పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని నినాదాలు చేశారు. ప్ల కార్డులను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. పేపర్‌తో తయారుచేసిన 1000 బ్యాగులను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ క్యాథరిన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని విస్మరిస్తే మానవజాతి మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఊడిన వాహనం టైరు: ముగ్గురికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి: మండలంలోని శాయిన్‌పల్లిలో పెళ్లికి వెళ్తున్న ఒక ప్రైవేటు వాహనం టైర్ ప్రమాదశావత్తు ఊడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం నాగర్‌కర్నూల్ నుంచి శాయిన్‌పల్లికి క్రూజర్ వాహనంలో బంధువులతో వెళ్తున్నారు. మహాదేవ్పనిపేట సమీపంలోకి రాగానే వాహనం టైర్ ఊడింది. దీంతో ప్రైవేటు వాహనం అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

జిల్లా అధ్యక్షుడిగా రొడ్డనాగేష్

పెంట్లవెల్లి: జాతీయ మానవ హక్కుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా మండలంలోని మల్లేశ్వరం గ్రామానికి చెందిన నాగేష్‌ను సోమవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మహమ్మద్‌అర్షద్‌ఖాన్‌కు, చీఫ్ సెక్రెటరీకి సయ్యద్ షబ్బీర్‌అలీలకు కృతజ్ఞతలు తెలిపారు.

సభను విజయవంతం చేద్దాం

బిజినేపల్లి: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేద్దామని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడిదల రాము కోరారు. సోమవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల నుంచి జన సమీకరణ చేయాలని సూచించారు. డా.మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పేర్కొన్నారు. దానం బాలరాజు, వరుణ్‌కుమార్, సహదేవ్, సచిన్, శంకర్, రవిశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

లింగాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు మనీషా, వనజ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం పర్వతాలు తెలిపారు. 5వ తరగతిలో సీట్లు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినులను సన్మానించారు.

ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం బల్మూరు మండలం జినుకుంట కనకాల మైసమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అచ్చంపేట మండలం ఘనపూర్‌కు చెందిన బీఆర్ఎస్, ఇతర పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బిక్కుమాండ్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గన్యానాయక్, పర్వతాలు, వెంకటయ్య, నిరంజన్, ఆంజనేయులు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం



నాగర్‌కర్నూల్ ఫుట్‌పాత్ వ్యాపారుల దుకాణాల్లో చెలరేగిన మంటలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఫుట్‌పాత్ వ్యాపారుల దుకాణాలలో సోమవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఫుట్‌పాత్‌పై వివిధ వ్యాపారాల దుకాణాలు ఉన్నాయి. ఏసీ రిపేరింగ్ దుకాణం, లెదర్ బ్యాగులు, ఇతర వస్తువులు విక్రయిస్తున్న దుకాణాల నుంచి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో సమీపంలో ఉన్న మరో దుకాణానికి నిప్పు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకోకపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. దాదాపు రూ. 4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించండి



మాట్లాడుతున్న చారకొండ వెంకటేష్

నాగర్ కర్నూల్: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజినేపల్లిలో భారీ బహిరంగ సభకు హాజరవుతారని కార్యకర్తలు అధికసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కూరాకుల శ్రీనివాసులు, పోలె భాస్కర్, కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, నాయకులు జెట్టి వెంకటేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మిద్దె మల్లేష్, పార్లమెంటు కన్వీనర్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సలేశ్వరం భక్తులకు ఆర్థిక భారం

మన్ననూర్: అభయారణ్యంలోని సలేశ్వరం లింగమయ్యను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారితో అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అవుతుందని అధికారులు ఆర్థిక భారం మోపుతున్నారని భక్తులు వాపోతున్నారు. ఏడాదికి ఒక్కసారి వచ్చే సలేశ్వరం ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే అత్యధికంగా వస్తుంటారు. ఈ క్రమంలో వివిధ డిపోల నుంచి ప్రత్యేకంగా నడిపిస్తున్న ఆర్టీసీ బస్సు చార్జీలు అచ్చంపేట నుంచి సలేశ్వరం వరకు అంటూ భక్తుల నుంచి రూ: 160 వసూలు చేస్తూ మార్గ మధ్యలో పుల్లాయిపల్లి వద్ద భక్తులను దింపేస్తున్నారు. పుల్లాయిపల్లి నుంచి సలేశ్వరం వెళ్లాలంటే సుమారు మరో 8 కిలో మీటర్లు అటవీ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. అక్కడి నుంచి భక్తులు తప్పని పరిస్థితిలో రూ: 50 రూపాయలు చెల్లించి ఆటో, జీపులను ఆశ్రయించే దుస్థితి ఏర్పడింది. అధికారులు ట్రాఫిక్ జామ్, తదితర కారణాలతో భక్తులపై అధిక భారం మోపుతున్నారు. ఇది ఇలా ఉండగా గతంలో ఒక్కరికి రూ. 150 లు బస్సు ఛార్జీ తీసుకొని అచ్చంపేట నుంచి సలేశ్వరం (రాంపూర్‌పెంట) వరకు భక్తులను చేర్చేది. అక్కడి నుంచి 1.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న సలేశ్వరంకు ఓపిక ఉన్న వారు కాలినడకన వెళ్తే కొందరు మాత్రం రూ: 20 చెల్లించి ఆటోలో వెళ్లేవారు. అధికారులు స్పందించి రాంపూర్ పెంట వరకు బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్వకుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రఘునాథరావు



కాంసానిపల్లిలో

కల్వకుర్తిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ రఘునాథ్‌రావు కోరారు. సోమవారం కల్వకుర్తి మార్కెట్ ఆవరణలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు నిబంధనలు పాటించి మద్దతుధర పొందాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి సీఈఓ వెంకట్ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల:
మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామైక్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని కాంసానిపల్లి, తాడూరు, ఉప్పరిపల్లి, మామిళ్లపల్లి, పెనిమిళ్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఐకేపీ ఏపీఎం సైదులు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించొద్దన్నారు. ధాన్యం నాణ్యతనుబట్టి మొదటి గ్రేడ్‌కు క్వింటాలుకు రూ. 2203లు, గ్రేడ్-2 రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2183లు అందజేస్తుందన్నారు. ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఇసుక టిప్పర్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని రైతుబజార్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన మార్కండేయ ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఇసుక టిప్పర్ సైకిల్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మార్కండేయకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. దీంతో బాధితుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

చెరువు తూమును తెరిపించండి



తహసీల్దార్‌కు వివరిస్తున్న స్థానికులు

కొల్లాపూర్: పట్టణంలోని 10వ వార్డులో ఉన్న కావలోనికుంట చెరువు తూమును తెరిపించాలని సమీపంలో ఉన్న నివాస ప్రజలు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు కింద భూములు కలిగిన కొందరు తూమును మూసివేశారని వివరించారు. దీంతో చెరువులో నీళ్లు ఎక్కువ అయినప్పుడు సమీపంలోని నివాసాల్లోకి వస్తున్నాయని, నీళ్లతో పాటు విష సర్పాలు, ఇతర జీవులు కూడా ఇండ్లలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చెరువు తూమును బాగుచేసి రెగ్యులర్‌గా నీటిని కిందికి వదలాలని వారు కోరారు. బాబా, శివకుమార్, రాము, వెంకటేష్ తదితరులున్నారు.